"చస్తాడు! మనల్ని కాదని వెళ్తున్నాడు కదూ? నిలువునా చస్తాడు! అదే వాణ్ని చంపేస్తుంది. అది– ఆడది కాదు, మనిషి కాదు, రాక్షసి! వాణ్ని మనకు కాకుండా చేసి, తీసుకుపోతోంది– పోనీ! వాణ్ని నిలువునా చంపేస్తుంది!..."

ఆవేశంలో వణికిపోతూ శాపనార్థాలు పెడుతున్న తండ్రి గొంతు పదేపదే చెవుల్లో ప్రతిధ్వనిస్తోంది ఆనందరావుకు.

స్పృహలో ఉందో లేదో తెలియదు తల్లి. కిందపడిపోయింది. ఆమెకు ఉపచారాలు చేస్తోందొక చెల్లెలు. మరొక చెల్లెలు గోడ కానుకుని బిక్కచచ్చి నిలుచుంది.

ఆ దృశ్యం మరుపు రాకుండా ఉంది ఆనందరావుకు.

"ఇలా వెళ్ళిపోవటం వాడి చావుకే! వెళ్ళనీ! చావనీ!..." వణికిపోతూ అరుస్తున్నాడు తండ్రి.

* * *

సూళ్ళూరుపేటలో ఉదయం పదిన్నరకి బస్సు దిగిన ఆనందరావుకి– శూన్యం నుంచి శూన్యానికి వచ్చినట నిపించింది

అసలు తను పార్వతి నెందుకు పెళ్ళిచేసుకొన్నాడు? ఎవరినో ఒకరిని చేసుకోక తప్పదు గదా! పార్వతిని చూసినప్పుడు 'ఈ అమ్మాయిని పెండ్లి చేసుకుంటే!' అనుకున్నాడు. ఆ మాటే ఆమెతో అన్నాడు. కులాంతర మౌతుంది. మావాళ్లొప్పుకోరు. ఇలా ఎన్నో కారణాలు చెప్పింది గదా! తప్పించుకోవాలని చూసింది గదా! అయినా తను తప్పించుకోనివ్వలేదు, చివరికిఒప్పించాడు.

తన తల్లి తండ్రీ ఒప్పుకోలేదా? ఒప్పుకున్నట్టే గదా! వాళ్ళు ఎంత కాలంగానో ఇస్తూ వుండిన భరోసాల వల్లనే గదా తను ధైర్యం తెచ్చుకుని పార్వతిని అలా ఒప్పించాడు. కాని, ఎందుకో ఎక్కడో బెడిసి కొట్టింది! పెళ్ళయితే జరిగింది. హడావుడీగా జరిగింది. కాపురం మొదలయేసరికి అన్నీ కాని సంగతులు తానే తెలిసిపోయాయి. పార్వతికి భూతల నరకం ప్రారంభమయింది కదా!

"తప్పంతా నాది! హాయిగా మీ అమ్మా నాన్నా చెప్పినట్లు మీ వాళ్లలో ఎవరినో చేసుకుని సుఖపడవలసిన దానివి– ఇలా ఈ కుత్తి బోనులో పడ్డావు–" అని తను పశ్చాత్తాపం పడితే, పార్వతి ఏడ్చింది. అంతే. ఆగటు స్త్రీ ఏం చేస్తుంది?




మేలెంచే ముందు తప్పనిసరిగా కీడెంచటం తనకు అలవాటే గదా! ఎంచిన కీడల్లా తంచనుగా జరుగుతూనే వచ్చింది. విడ మొగాలు, పెడ మొగాలు. వేరు వేరు భోజనాలు, కోడలి చాటుగా గుసగుసలు. వస్తువులన్నీ వేరువేరు, ఆఖరికి మాసిన బట్టలు వడేసే దగ్గర... రగడ పెరిగింది. అతుకుతుంది అతుకుతుంది అనుకుంటున్నది కాస్త– అప్పుడే తెగిపోయింది!

ఒక నిద్రలేని రాత్రి! ఒక అస్తవ్యస్త ఉదయం–

...తల్లి స్పృహతప్పి పడింది. చెల్లెళ్ళు కీలుబొమ్మల్లా ఉన్నారు. తండ్రి చావమని శాపనార్థాలు పెడుతున్నాడు.

తను కట్టుబట్టలతో, పార్వతితో ఇల్లొదిలి వచ్చేశాడు.

శూన్యంలోంచి శూన్యంలోకే వచ్చినట్టుంది ఆనందరావుకు. సూళ్ళూరుపేట రోడ్డుమీద

**ఆంధ్రపత్రిక**

దినపత్రిక చదవండి.

- సాహిత్య సేవకు
- సాహిత్య స్థాయికి
- తాజా వార్తలకు
- కొత్త శీర్షికలకు

చదవండి!

ప్రసిద్ధ వాచ్ కంపెనీకి ఆంధ్రాలో

**సేల్స్‌మన్ కావలెను**

నెలసరి ఆదాయము కమిషన్ లేదా జీతము ద్వారా సుమారు 550/- లకు పూచీ గలదు. రు. 150/- లు పెట్టుబడిగలవారు స్వంత చిరునామా వ్రాసిన కవరుకు పంపండి.

ADVERTISER (A-4)
P. Box. 9441, DELHI-51.

కృష్ణకుమారి
ప్రమోదకరమైన
ప్రయోజనాత్మక నవల
సూపర్ స్టార్
వివరాలు త్వరలో...

హస్త ప్రయోగము - నపుంసకత్వము

**సెక్సు హాస్పిటల్**



దుర్బలాలకు లోనై దాంపత్య సౌఖ్యం అనుభవించలేనివారు వెంటనే సంప్రదించండి!

డా॥ A. పూర్ణచంద్రరావు
(సెక్సు స్పెషలిస్టు) N.D. F.N.F.U (CEYLON) R.A.M.P
గవర్నరుపేట, మ్యూజియంరోడ్, విజయవాడ-2. (A.P)

ముఖవ్యాధులకు ప్రత్యేక చికిత్స

Phone No. 63753


# గారడీ

దుమ్ము రేగుతోంది.

"శ్రీహరికోట వెళ్ళటానికి బస్సుందా ఇప్పుడు ? -" అని అడిగాడు పక్కనే ఉన్న కిళ్ళీబంకులో.

"పావుగంట క్రితమే కావలి బస్సు వెళ్ళిపోయింది. ఇంక మధ్యాహ్నమే. కావలిస్తే రైల్వే గేటు దగ్గిర నిలబడి చూడండి. ప్రయివేటు బస్సులొస్తాయి. కాని అవి శ్రీహరికోట సెక్యూరిటీ గేటు దగ్గిరే ఆగిపోతాయి. లోపలికి వెళ్ళవు. కాలనీకెళ్ళాలంటే రెండు మైళ్ళుంటుంది... ఏం చేస్తారు ? పోనీ గేటు దగ్గిర చూడండి. 'షార్' బస్సులే ఉంటాయి. ఎవర్నయినా ఆ ఉద్యోగస్థుల్ని అడిగితే – వాళ్ళ పాస్ మీద మిమ్మల్ని తీసుకెళ్ళచ్చు..."

అదీ సమాధానం. సమాచారం.

దుమ్ము పీలుస్తూ నడుస్తున్నాడు ఆనందరావు.

శూన్యాన్ని పీలుస్తున్నట్టుంది. ఎక్కడ ఎలా ఉండవలసిన వాడు, ఇక్కడ ఇలా ఎందుకున్నాడు ?

చదువంతా చదివీ, ఉద్యోగం వెదికే ప్రయత్నం చెయ్యకపోవటం తప్పయిపోయిందా? గుడ్డిలో మెల్లగా పార్వతికయినా ఉద్యోగం ఉండబట్టిగాని– లేకుంటే ఇద్దరిగతీ ఏమయి ఉండేది ?

ఇంటినుంచి గెంటెయ్యబడే ప్రమాదం ఎప్పుడో ఊహించాడుగదూ తను ! అందుకే పార్వతిని క్వార్టర్స్‌లో గది ఖాళీ చెయ్యొద్దన్నాడు.

ఎంత సరిగ్గా ఆదుకుంది అది ! ఆ గది ! పార్వతిని అందులో మళ్ళీ ప్రవేశపెట్టాడు! ఇంక నెలన్నర గడిస్తే శెలవులొస్తాయి ! అప్పుడు వేరే ఇల్లు వెదుక్కుని ఇద్దరూ కొత్త కాపురం పెట్టేదారి చూడవచ్చు.

"అలాగే చెయ్యండి గురూగారూ ! మీకేం భయం లేదు. అంతవరకూ మీరలా ఊళ్ళు తిరిగిరండి !..." అన్నాడు శివశంకరం.

"మీరొచ్చే సరికి ఇల్లు చూసి రెడీగా ఉంచే పూచీ నాది ! వొదినగారికి బోరుకొట్టకుండా అప్పుడప్పుడూ కంపెనీ ఇచ్చే బాధ్యత మా ఆవిడది" అన్నాడు కొత్తగా పెళ్ళయిన మిత్రుడు పతి.

మిత్రులు లేకుంటే తను ఏమయి ఉండేవాడు ?

శ్రీహరికోటలో భాస్కరం మాత్రం ? అతనే తను అనేంత దగ్గరగా... పెళ్ళికిముందే ఇంత భరోసా ఇచ్చాడు!

"ఏదేమైనా కానివ్వు నేనున్నానని మరచిపోకు!..." ఎంతమాట !

"మళ్ళీ నెలన్నరకి!" అని వీడ్కోలిస్తుంటే, బలవంతాన నవ్వుతూ అంతలో కంటతడి పెట్టింది పార్వతి.

"అంతా సవ్యంగా జరుగుతుంది. మీరు వెళ్ళిరండి గురూగారూ!" అని సాగనంపారు శివశంకరం, పతీ!

అలా బయలుదేరాడు. ఇలా వచ్చాడు.

రైల్వే గేటు దాటాడు ఆనందరావు. అప్పుడే ఒక ప్రయివేటు బస్సు– బయలుదేరటానికి సిద్ధంగా ఉంది అది జనంతో కిటకిటలాడిపోతోంది. భరించి వెళినా– అక్కడా గేటు దగ్గర నడవాలి! ఎందుకూ?

'షార్' బస్సులూ ఉన్నాయి. ['షార్'– శ్రీహరికోటకు ఆధునిక పొట్టి పేరు!) వాటిలో దేన్నయినా పట్టుకుని వెళ్ళాలి! వెళ్ళవచ్చు! కాని, ఎవర్నయినా బతిమిలాడాలి! డ్రయివర్నయినా– 'రిక్వెస్ట్' చెయ్యాలి! ఎవరూ సహకరించకుంటే?...

అసలా ప్రయత్నమే వద్దనిపించింది. విచారించగా, పన్నెండుకి నెల్లూరు బస్సు ఉందని తెలిసింది! ఇంకా గంటన్నర !

ఎంత దుమ్మయినా, తోచనితనమయినా సూళ్ళూరుపేటలో అలా తిరుగుతూ గడిపెయ్యటమే బాగుంటుందనిపించింది.

మళీ గేటుదగ్గరికి వచ్చాడు ఆనందరావు.

డుబుడుక్కు డుబుడుక్కుమని శబ్దం వినిపించింది. ఆకర్షించిన ఆ ధ్వని వినిపించిన వేపు చూశాడు ఆనందరావు.

గేటుఇవతలే "సబ్ రిజిష్ట్రారు ఆఫీసు" అని బోర్డు రాసి ఉన్న పెద్ద కాంపౌండ్ గోడ పక్కగా, రోడ్డు వారగా, బిచాణా పరుస్తున్నాడొక సన్నటి నల్లటి పొట్టి– గారడీవాడు.

వాతావరణాన్నంతా కలయజూశాడు ఆనందరావు. గేటుకి కొద్దిగా పైనే రైల్వేస్టేషను. గేటుదాటి వూళ్ళోకి వెళ్ళే మట్టి రోడ్డుకి అటూ యిటూ షాపులు. సబ్ రిజిష్ట్రారు ఆఫీసులోనే ట్రెషరీ కూడా ఉన్నట్టు మరొక బోర్డు వ్రేళ్ళాడుతోంది. కాంపౌండు లోపల చాలా పాత పెంకుటింటి కట్టడాలు రెండు మూడున్నాయి. కాంపౌండు చాలా విశాలంగా

ఉంది. ఖాళీ ఆవరణలో వేపచెట్టూ, రావి చెట్టూ ఉన్నాయి. వాటి చుట్టూ చక్కటి అరుగులున్నాయి. కోర్టు పనులు కొందరూ, పోలీసులు కొందరూ, కొందరు మధ్య వర్తులూ, కొందరు రికామీ శాల్తీలూ... వరండాల వెంటా, చెట్ల దగ్గిరా, అరుగుల మీదా తచ్చాడుతున్నారు, కూచుని వ్యవహారాలు మాట్లాడుకుంటున్నారు. ఎండ తీక్షణంగా ఉంది.

గంటున్నర కాలాన్ని గడపటానికి ఇంకె క్కడికీ వెళ్ళాలనిపించలేదు ఆనందరావుకు.

ఎప్పుడో చిన్నప్పుడూ, స్కూలుకి వెళ్ళే దారిలో చెట్ల కింద ఇట్లాంటి గారడీ ప్రదర్శనలు జరుగుతూండగా చూడబోయిన వైనం గుర్తొచ్చింది.

కాని, చిన్నతనాన ఆ భయాలు వేరు. సహజంగానే కాస్త భయస్తుడు ఆనందరావు. ఆ గారడీ ప్రదర్శనల్లో గారడీ వాడి వింత యాసమాటలూ, గారడీ ప్రదర్శనల్లో ఏ ముకలూ, బొమికలూ, గారడీ వాడి మాటల్లోనూ చేతల్లోనూ ఒకరకమైన క్రూరత్వమూ; ఇవన్నీ చిన్నప్పుడు చాలా భయపెట్టేవి. అంతేకాదు. ఈ ప్రదర్శనలు మామూలుగా స్కూలుకి వెళ్ళేదారిలో జరిగేవి. వీటిముందు పిల్లలు నిలుచున్నట్లు మేష్టర్లు చూస్తే— అప్పాటో మరసటి రోజో— వీపు విమానం మోత మోగిందన్న మాటే! అంత భయపడుతూ, భయపెట్టేవి కూడా అయిన గారడీ ప్రదర్శనలు చివరిదాకా ఎప్పుడూ చూడలేదు ఆనందరావు.

"ఇప్పుడు చూద్దాం. ఎలాగూ టైము గడవాలిగదా!" అనుకుంటూ గారడీ వాడి విడిదాకు బాగా దగ్గరగా, సినిమా ప్రకటన కోసంకట్టిన సరుగుడుగుంజకు ఆనుకున్నాడు. కాస్తంత విశ్రాంతిగా అనిపించింది. చింత చెట్టు కొమ్మలు ఎత్తులో ఉన్నా, కాస్త పలచటి నీడనయినా ప్రసాదిస్తున్నాయి.

సినిమా ప్రకటనకి కాస్త దిగువగా, వొక అడ్డుకొయ్య కట్టి ఉంది. అదీసరుగుడుదే. భుజాన బరువుగా అంతసేపూ ఉండి బాధించిన సంచీ తీసి, ఆ అడ్డుకొయ్య కొనకి తగిలించాడు ఆనందరావు. "ఈ గారడీ వాడు... ఇంతకీ ఎలా మొదలెడతాడు? ప్రదర్శన ఎలా రక్తి కట్టిస్తాడు? చూడాలి!" అనుకుంటూ, స్వంత బాధను కాసేపు విస్మరించి, సరుగుడు గుంజను కాస్త తేలికగా ఆనుకున్నాడు.

## గారడీ

దుబుడుక్కు దుబుడుక్కుమని మధ్య మధ్యన డమరుకం మోగిస్తున్నాడు గారడీ వాడు. అటూ ఇటూ చూడలేదు. తల ఎత్త లేదు. ఏదో తనపనిలో తాను ఉన్నట్లు సరం జామా అంతా సరుస్తూ, సర్దుతూ ఉండి పోయాడు.

ఆసరికే ఆ సరంజామా అంతటిముందూ నేలలో ఒక బెత్తెడు సన్నటి ఇనపచువ్వ నాటాడు. దానికొక మూరెడు తాటితో ఒక ముంగిసను కట్టేశాడు. ఇత్తడి చెంబు లోంచి పసుపు నీళ్ళు తీసి "ఘ - ఘ —" అని మంత్రించి ఆ ముంగిసమీద చిలకరించాడు. "హేయ్" అని పెద్దగా కేకపెట్టి దాన్ని అదిలించాడు. ముద్దుగా ఒత్తయిన బొచ్చుతో ఉన్న ఆ మచ్చల ముంగిస ఇనపచువ్వచుట్టూ, వర్తులంగా వేగంగా తిరుగుతోంది.

నున్నగా సమంగా ఉన్న ఒక మూరెడు కర్రను నిలువుగా పెట్టి, దానిపై ఒకఇత్తడి పళ్ళెన్ని ఊతంగా నిలబెట్టి, దాన్ని చేతో గిర్రున తిప్పి, తిరుగుతున్న పళ్ళెం అంచుకి మరొక బెత్తెడు కర్రముక్కను తాకించి 'గర గరా— గరగరా' అని శబ్దం పుట్టించాడు గారడీ వాడు. "ఘ-ఘ-" అని గాలితో ఊదుతూ ఉపాసనా మంత్రంలా జపించి, "హేయ్" అని కేకపెట్టి; అదొక ఒడుపుతో కర్రనూ పళ్ళాన్నీ నేలమీదికి గిరాటువెట్టాడు.

అంత వరకూ వాడు ఎవరితో నూ మాట్లాడలేదు ఎవరినీ తన గారడీ విద్య చూడరమ్మని ఆహ్వానించ లేదు.

కాని వాడి చేష్టలూ, వాడి కేకలూ, వాడు పుట్టించిన ధ్వనులూ, వాడు పరిచి పెట్టిన సరంజామా, వలయాలుగా తిరుగు తున్న వాడి ముంగిసా... మెలమెల్లగా జనాన్ని ఆకర్షించసాగాయి. వాడువేరుగా పిలువనవసరం లేకుండా, చిన్నా పెద్దా, ముసలిముతకా వాడి చుట్టూ పోగవటం మొదలయారు.

వెంట తెచ్చిన మూటల్లో మరొకదాని లోంచి ఇంకాస్త సామగ్రి బయటకి తీశాడు గారడీవాడు. చచ్చిపోయిన పాము నొకదాన్ని తీశాడు. నిజానికది పాములోని మాత్రమే. లోపల గడ్డి కుక్కి, చర్మాన్ని కుట్టువేసి— దాన్ని పడగ విప్పిన పాములాగా కట్టిపెట్టి వుంచాడు.

ఆ పామును ముంగిస తిరుగుతున్న చోటికి కాస్త దూరంలో పెట్టాడు. ముంగిసను కట్టిన చువ్వనుంచి అక్కడికి ఒక గీతగీశాడు. మధ్యన "ఘ...ఘ..." అని మంతించాడు.

డమరుకం తీసి దుబుడుక్ దుబుడుక్మని తీవ్రంగా మోగించాడు. బట్టల మూటలోంచి రెండు పటాలు తీసి, ఏవో మంత్రాలు ఉచ్చరిస్తూ వాటిని ప్రతిష్ఠించాడు. డబ్బీ లోంచి నల్లటి కాటుక తీసి, నుదుటన బొట్టుగా ఉంచుకున్నాడు. కుంకుమతో రెండుసార్లు ఆ పటాలను అర్చించాడు. పక్కగా వున్న బొమికను అందుకుని, మంత్ర దండంలా దాన్ని పటాలచుట్టూ "ఘుప్... ఘుప్...!" అంటూ తిప్పి— వాగుబాము బొమ్మకూ, ముంగిసకూ తాకించి "మళయాళ మగా భగమతి— కాళీ—" అంటూ యింకా ఏదో అస్పష్టంగా వల్లెవేసి బొమికను అవతల పెట్టేశాడు. ఆ తరువాత మిగతా సామగ్రిని ఇంకా విశదంగా ప్రదర్శించి పెడుతూ ఆ పటాల్లోని దేవతల్ని ఉద్దేశిస్తు న్నట్లుగా బిగ్గరగా ఇలా అన్నాడు—

"తంజావూరు మగా నగరంలో మవ్వు చూపిస్తివి. ఎంత జనం ఇరగబడి సూశిరి. ఇంద పాము కర్చె మాదిరి వుండుకున్న ఇందప్పాము... నక్కసారిగ జీవం తెచ్చుకుని కలబడిపోరాడెనే...అదే పహారంగా...తాయే... మగా మంత్రదేవి... నీయొక్క మగిమ సూపించ్చు... హేయ్... ఇరగమసగ...ఆగు! సూస్తినా నిలిసిపోవాల... మల్లా కదల మంటునా అప్పుడు కదిలిపోవాల... అంద మాదిరే... పసుపునీల్లు సల్లి ఒక్క రూబా ఓల్లు పూడ్చి పెడితే... యాద్... బగమతీ! సూస్తు వుండగనే సెట్టు మొలిసెయ్యవలె గద... ఆఁ... ముసిలాయన సంబరపడ్తుడు. తప్పకొండి. జరుగుమీ... డబ్బు శెట్టుగాడు పళ్ళచెట్టు మొలవ్వల! అరటిపయం... జాం పయం—ఏమిగావల... అదురూ తినవలె... యాప్రకారముగా కంచిలో నువ్వు ఆయొక్క మోడికట్టు సూపిస్తివో...అదే పహారంగా... ఇక్కడ సూపించ్చుమి...హేయ్! ఘ...ఘ..."

అలా మొదలయింది. గారడీవాడు మెల్ల మెల్లగా ఉత్సాహం పుంజుకున్నాడు. కాని ఆ ఉత్సాహం అంతగా బయట పడనివ్వలేదు. వాడు మరో మారు పళ్ళెం కర్రమీద గిర్రున తిప్పాడు.డమరుకంమరింతసేపు మోగించాడు.

ప్రేక్షక సమూహం తగుపాటిగా పోగ యింది. "ఆఁ... ఇహ జాస్తిగా తొచ్చారదు

వనితలకు మనవి
కొత్తరకం వంటలు
క్లుప్తంగా వ్రాసి పంపితే
త్వరగా పరిశీలించవీలు —సం.

వరముల బలహీనత, గుప్తరోగములకు
ఉత్తమ చికిత్స!

పెండ్లికి ముందు, పెండ్లి తర్వాత సంప్రదించండి.
Dr. Z H. ROY (Govt Regd)
Dr. K. Kesava Rao, (GovtRegd)
ఆసియా క్లినిక్
ఆర్.టి.సి. క్రాస్‌రోడ్
సంధ్య టాకీస్ ఎదుట,
హైద్రాబాద్ – 500020.
కృష్ణాటాకీస్ వద్ద, కడప-1.

మూలశంకకు
త్వరగా
నమ్మకమైన
హెడన్‌సా
విరేచనముతో
చికిత్సను పొందండి
–శస్త్రచికిత్స
అవసరములేదు!

సహించలేని బాధ ఉందా? తీవ్రంగా దురద వుందా? మంటతో నెత్తురు పడుతుందా? అమోఘమైన చికిత్స. ఎంత మాత్రము కాలయాపన చేయవద్దు! ఉపేక్షిస్తే తీవ్రమైన పరిస్థితులకు దారి తీసి-శస్త్రచికిత్స తప్పనిసరి కౌతుంది. సకాలంలో హెడెన్‌సాతో ఉపశమనాన్ని పొందండి. ఇది నమ్మకమైన జర్మను మూలశంక విరేచనము. 108 దేశాలలో వైద్యులందరూ శిఫారసు చేస్తున్నారు! హెడెన్‌సాలో ఉండే అమోఘమైన మందులు శీఘ్రంగా గుణాన్నిచ్చి బాధను దురదను శమింపజేస్తుంది-విరేచనము ఎంతమాత్రము కష్టమనిపించదు.

గమనించండి సకాలంలో హెడెన్‌సా చికిత్స చేసుకుంటే ముమ్ముందు శస్త్ర చికిత్స అవసరముండదు!

3627 TG

# గారడీ

లేదు. యాద్! బగమతీ! చెంగల్రాట్టువ యెయ్యి మందిరి ముందరగా వీయొక్క మోడి సూపిస్తివే...అదే ఇదంగా ఇక్కడ సూపించు. రాజ... నాయన... పిన్నలె తగ్గవలె! జరుక్కా- జరుక్కా..." గారడీ వాడు జనాన్ని వర్తులాకారంగాసర్ది కూచోబెట్టాడు.

పదేపదే డమరుకం మోగిస్తూ, కర్రమీద పళ్ళె తిప్పి శబ్దంచేస్తూ... తను ఏమేం వింతలు చెయ్యగలడో ఏకరువు పెట్టాడు వాడు-

"బొమ్మ మాదిరిక చచ్చిపోయినట్టుగ పడివుండె అందప్పాము బుసగొట్టి... పాకి వస్తుంది... ఇందుముంగిస దాన్తో పోరాట్టం నడుపును... చిన్నపిల్లలు ఉన్రటు...జరుక్కా రాజ- నాయ్న... పిన్నాలె జరుక్కా... అదే ప్రహారంగ నాన్ వొక్కపని సూపిస్తను... రూపాయి బిళ్ళదా పూడ్చి పెడుదును... పసుప్పు నీల్ సల్లుదును.. అదులేండి... అందరి కన్నులు మున్నొడిదాన్... శెట్టు మొలుసును- క్యా- బగమతీ!... పెద్ద వాలు ఉంరటు కైకట్ట కూడదు... చేతులు కట్టగోవొద్దు... తలగుడ్డ చుట్టబాకండి... హేయ్!... ఎందమాదిరి విద్య సూపమన్నరు అందమాదిరి సూపుదునుగాని... అంత... ఖర్చవుతాది... హేయ్... అదంతాపూర్వగాలం ...ఇప్పుడు సామాన్య మనుషులు... చిన్నవిద్య సూపిస్తను సాలును... ఆ... తగ్గు... పాము బతుకును... సెట్టు మొలుసును. సెట్టు నిండ పండ్లు కాసును...అంతాసూపిస్తను- బెద్దాయన- కూసుకోండి... ఆఁ..."

అంతటితో గారడీ వాడికి ఆ పరిసరాల్లో ఉన్న జనులందరి మీద ఒకరకమైనఅధికారం వచ్చేసినట్టయింది. కొందర్ని వెనక్కితగ్గ మన్నాడు. కుర్రాళ్ళని ముందుకు రమ్మన్నాడు. పెద్దవాళ్ళని చేతులు కట్టుకోవద్దు,విప్పెయ్య మన్నాడు. పసుపు నీళ్ళు చల్లి ముంగిసను మరో మారు అదిలించాడు. పటాలకు మరో సారి కుంకుమతో జపం చేశాడు. డమరుకం మోగించాడు. పళ్ళెం తిప్పాడు. సరంజామా అంతటినీ పదేపదే సర్దాడు. బొమికతో చుట్టూతా గీతగీసి 'క్షుక్షు' అంటూ మంత్రించి డబ్బీలోంచి ఇంకేదో పొడితీసి పటంలోని అమ్మవారు మీద చల్లాడు.

ఆనందరావుకు కాళ్ళపీకుడు మొదలయింది. మొదలెట్టి చాలా సేపే అయినా, గారడీవాడు వెంటనే ఏమీ చేసేట్టు కనిపించలేదు. అంత సేపూ ఆ కేకలు వెయ్యటం, తంతునిర్వహించటం- ఎందుకూ? అనుకుంటే... జనాన్ని ఆకర్షించి తన గుప్పెట్లో ఉంచుకోవటానికే ననిపించింది.

"పాము బతుకువంటె...సెట్టు మొలుసునంటె- నంబవాటెనంద్రు... ఎవురు నమ్మితురు... సెంద్రుడి మీదికి రాకెట్టు పోవటంగాదు... ఇదివొగ విద్య... ఇందుకె యేమిసెప్పరు... ఇప్పుడు నమ్మనంటు... అందుకే నాన్ సూపిస్తను... -య్... అయ్యా... నీ గుడ్డ ఇస్తవా!..." అంటూ గారడీ వాడు, ప్రేక్షకుల్లో ఒక నడివయసాయన భుజంమీద నుంచి తెల్లటి పై గుడ్డను తీసుకున్నాడు.

"సూపిస్తను హో... బగమతి .. ఏ మంటు దీన్ని... వొట్టిపై గుడ్డ దానె... మామూలుగానే ఉంది." అందరికీ బట్ట విదిలించి, మడత విప్పి సాపుగ మాపెట్టాడు "బెద్దాయన గుడ్డ... మామూలుగానే వుంది. ఎంతబ్బాగుంది నాకు వప్పలేదు- రాజ- ఓ రాజ... రా నాయ్న..." అంట్టూ ముందు వరస పిల్లల్లో ఒకణ్ణి చేరబిలిచాడు

కుర్రాడు చురుగ్గా ఉన్నాడు. గారడీవాణ్ణి చూసిగాని, జనాన్ని చూసిగాని ఏ మాత్రమూ బెరుకు పడలేదు.

"ఏం రాజ... ఈ పై బట్ట సూస్తివి గద- ఇగో సూడు!..." అంటూ బట్ట అందించి "బాగుంద సొపుగుంద?" అని అడిగాడు గారడీ వాడు.

"ఆఁ... బాగుంది' అన్నాడు కుర్రవాడు.

"ఆఁ... బాగుంద? నాకు మనస్సు వప్పటంలేదు... ఈబట్టను కాల్చివేస్తనా."

"ఆఁ... కాల్చెయ్!..."

చుట్టూ జనం అంతా విరగబడి నవ్వారు.

"ఆఁ... కాలు మంటవి! నీది కాదుగదా- కాల్చివెయ్‌మంటివి! నీదయితే కాల్చమనవు గదా!" అన్నాడు గారడీ వాడు, లోకంలో ప్రతివాడి ధోరణి ఇలాగే ఉంటుందన్నట్టు.

"నాదైతే నేనెందుకు కాల్చమంటాను?" అన్నాడు కుర్రవాడు, లోక సహజం అదేనన్న ధోరణిలో.

"అయ్యో!... నా పై పంచె!..." అన్నాడు పైపంచ స్వంతదారుడు, జనం లోంచి.

(ముగింపు పైవారం)